తప్పుడు పత్రాలతో మద్యం దుకాణం నిర్వహణకు లైసెన్స్

ఇద్దరిపై కేసు నమోదు

మేడ్చల్, డిసెంబర్ 25 : తప్పుడు ఒప్పంద పత్రాలతో మద్యం దుకాణం నిర్వహణకు లైసెన్స్ పొందిన ఇద్దరిపై మేడ్చల్ పోలీస్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై మురళీధర్ కథనం ప్రకారం... మేడ్చల్ పట్టణంలోని వెంకట్రామయ్య కాలనీలో నివాసం ఉండే నాగరాజు గౌడ్, ఆంధ్రప్రదేశ్, కర్నూల్‌కు చెందిన పరమేశ్వర్ రెడ్డి 2021 నవంబర్‌లో మేడ్చల్ టీఎన్జీవోస్ భవనాన్ని అద్దెకు తీసుకున్నారు. ఆ భవనానికి తానే యజమానిగా పరమేశ్వర్ రెడ్డి దుకాణం నిర్వహించేందుకు అనుమతిస్తున్నట్టు తప్పుడు పత్రాలను సృష్టించాడు. సాయి మహేశ్వరీ పేరుతో మద్యం దుకాణం నిర్వహించడానికి ఒప్పందం చేసుకున్నట్టు చూపిన పత్రాలను ఎక్సైజ్ అధికారులకు పరమేశ్వర్ రెడ్డి సమర్పించి, లైసెన్స్ పొందాడు. అయితే 2023 నవంబర్ వరకే ఒప్పందం ప్రకారం టీఎన్జీవోస్ భవనం లీజు ముగిసింది. అప్పటి నుంచి నాగరాజు గౌడ్, పరమేశ్వర్‌రెడ్డిని ఖాళీ చేయాలని టీఎన్జీవోస్ సంఘం నేతలు వత్తిడి చేస్తున్నా అద్దె చెల్లించడం లేదు, ఖాళీ చేయడం లేదు. ఈ క్రమంలోనే వారి వ్యవహార శైలిపై ఆరా తీయగా తప్పుడు పత్రాలు, ఫోర్జరీ సంతకాలతో మద్యం దుకాణం లైసెన్స్ పొందినట్టు తెలిసింది. వెంటనే టీఎన్జీఓ సంఘం నేతలు నాగరాజు గౌడ్, పరమేశ్వర్‌రెడ్డి పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. టీఎన్జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు రవిప్రకాశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై మురళీధర్ తెలిపారు.

పబ్ యజమానులపై కేసు

బంజారాహిల్స్,డిసెంబర్ 25: విపరీతమైన శబ్దకాలుష్యాన్ని కలిగిస్తున్న పబ్ నిర్వాహకులపై బంజారాహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నం.14లోని బీఎన్‌రెడ్డి కాలనీ సమీపంలో కొనసాగుతున్న ట్యాప్ పబ్, ఆఫ్టర్ 9 పబ్‌లలో రాత్రి పగలు తేడాలేకుండా చెవులు చిల్లులు పడేలా మ్యూజిక్, డీజే సౌండ్స్ పెడుతున్నారని కాలనీకి చెందిన ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు పబ్ యజమానులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇల్లీగల్ పార్సిల్ పేరుతో 5.98లక్షలు టోకరా

సిటీబ్యూరో: ఇల్లీగల్ పార్సిల్ వచ్చిందంటూ ఓ మహిళను బెదిరించి, రూ.5.98లక్షలను దోచుకున్న నిందితుడిని నగర సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి సెల్‌ఫోన్‌తో పాటు ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... ఉత్తర్‌ప్రదేశ్‌లోని అలీఘర్ ప్రాంతానికి చెందిన హర్ష్‌కుమార్(24) చైనా మోసగాళ్లకు ఫైనాన్స్ అకౌంట్‌ను అందిస్తున్నాడు. అంతే కాకుండా క్రిప్టో కరెన్సీని కొనుగోలు చేసి, చైనా నిందితులు అమాయకులను మోసగించి దోచుకున్న డబ్బును క్రిప్టో కింద మార్చుకుని తిరిగి చైనా నిందితులకు అందజేస్తుంటాడు. ఈ క్రమంలోనే నగరంలోని తార్నాకకు చెందిన ఓ మహిళకు నిందితుడు ఫోన్‌చేసి, తాము ఫెడెక్స్ నుంచి మాట్లాడుతున్నట్లు పరిచయం చేసుకున్నాడు. మీ పేరు, మొబైల్ నంబర్, ఆధార్ నంబర్‌తో ఈస్ట్ ముంబైలోని అందేరి ఫెడెక్స్ నుంచి తైవాన్‌కు ఒక ఇల్లీగల్ పార్సిల్ వెళ్లినట్లు అక్కడి అధికారులు గుర్తించారని బెదిరించాడు. ఈ క్రమంలో సదరు మహిళను భయభ్రాంతులకు గురిచేసి, ఆమె వద్ద నుంచి రూ.5,98,725ను దోచుకున్నాడు. కేసు నమోదు చేసుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు ఎట్టకేలకు నిందితుడిని యూపీలో పట్టుకుని, అరెస్టు చేశారు.

క్రికెట్ మ్యాచ్ టికెట్ల పేరుతో 5.26లక్షలు..

సిటీబ్యూరో: క్రికెట్ మ్యాచ్ టికెట్లు ఇప్పిస్తానంటూ నమ్మించి ఓ అమాయక వ్యక్తికి రూ.5,26,360 టోకరా వేసిన ఘరానా నిందితుడిని సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం...హర్యానాలోని గుర్‌గావ్ ప్రాంతానికి చెందిన మహ్మద్ రియాజ్(33) 'ఈవెంట్ షో' కంపెనీకి ఫ్రీలాన్సర్‌గా పనిచేస్తున్నాడు. కంపెనీ తరపున పలువురికి క్రికెట్ మ్యాచ్ టికెట్లను సమకూర్చేవాడు. దీనిని ఆసరాగా చేసుకుని డబ్బు సంపాదించాలనే దురాశతో కంపెనీ తరపున వచ్చే టికెట్లను ఇతరులకు విక్రయించాలని పథకం పన్నాడు. ఈ క్రమంలో నగరానికి చెందిన ఓ వ్యక్తిని మహ్మద్ రియాజ్ సంప్రదించి, తాను క్రికెట్ మ్యాచ్ టికెట్లను సమకూరుస్తానని నమ్మించాడు. దీంతో మార్చి 19న విశాఖపట్నంలో భారత్-ఆస్ట్రేలియా మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్‌కు సంబంధించిన టికెట్లు అందజేస్తానని చెప్పాడు. ఇది నమ్మిన బాధితుడు రూ. 5,26,360లను నిందితుడు సూచించిన ఖాతాలకు ట్రాన్స్‌ఫర్ చేశాడు. టికెట్లు అందకపోవడం, నిందితుడు స్పందించకపోవడంతో మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు సైబర్‌క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న సైబర్‌క్రైమ్ పోలీసులు హర్యానాలోని గుర్‌గావ్‌కు వెళ్లి నిందితుడిని అరెస్టు చేసి, నగరానికి తీసుకువచ్చి రిమాండ్‌కు తరలించారు.

ప్రజా భవన్ వద్ద బారికేడ్‌ను ఢీకొట్టిన కారు

ఖైరతాబాద్, డిసెంబర్ 25 : బేగంపేట ప్రధాన రహదారిపై ఉన్న ప్రజా భవన్ వద్ద బారికేడ్‌ను గుర్తుతెలియని కారు ఢీకొట్టింది. ఈ ఘటన పంజాగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...కారును ఓ వ్యక్తి వేగంగా నడుపుకుంటూ ప్రజాభవన్ మీదుగా వెళ్తున్నాడు. దీంతో కారు అదుపుతప్పి అక్కడే ఉన్న బారికేడ్‌ను ఢీకొట్టింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు దర్యాప్తు చేపట్టారు.

అనుమతి రాకముందే టికెట్ల విక్రయం

- సన్‌బర్న్ ఈవెంట్ ఆర్గనైజర్‌పై కేసు నమోదు
- న్యూఇయర్ వేడుకలపై అవగాహన కల్పించాం
- మాదాపూర్ అదనపు డీసీపీ నర్సింహారెడ్డి

మాట్లాడుతున్న మాదాపూర్ అదనపు డీసీపీ నర్సింహా రెడ్డి, చిత్రంలో ఏసీపీ శ్రీనివాస్

సిటీబ్యూరో/శేరిలింగంపల్లి, డిసెంబర్ 25(నమస్తే తెలంగాణ): నూతన సంవత్సర వేడుకల్లో డ్రగ్స్ విక్రయాలకు పాల్పడినా లేదా వినియోగించినా సహించేది లేదని, ఎంతటి వారైనా జైలు తప్పదని హెచ్చరిస్తున్నారు ట్రై కమిషనరేట్ పోలీసులు. మరో వైపు నూతన సంవత్సర వేడుకల ఈవెంట్‌కు సంబంధించి అనుమతి ఇవ్వకముందే టికెట్లు విక్రయించిన సన్‌బర్న్ ఈవెంట్ నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు మాదాపూర్ అదనపు డీసీపీ నర్సింహా రెడ్డి తెలిపారు. సోమవారం గచ్చిబౌలిలోని మాదాపూర్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో అదనపు డీసీపీ మాట్లాడుతూ... మాదాపూర్ పీఎస్ పరిధిలో ఉన్న సన్‌బర్న్ ఈవెంట్ నిర్వాహకులు సన్‌బర్న్ మ్యూజికల్ నైట్ పేరిట న్యూఇయర్ ఈవెంట్ నిర్వహణ కోసం దరఖాస్తు చేసుకున్నారని, అయితే వారి దరఖాస్తు ఇంకా పరిశీలనలోనే ఉందన్నారు. కానీ ఈవెంట్‌కు సంబంధించిన టికెట్లను విక్రయించినట్లు తమకు ఫిర్యాదు అందిందని చెప్పారు. ఈ మేరకు అనుమతి రాకముందే బుక్ మై షోలో టికెట్లు విక్రయించినట్లు తమ విచారణలో వెల్లడయిందన్నారు. పోలీసుల నుంచి ఎలాంటి అనుమతి లేకుండానే రూ.1499 ప్రారంభ ధర నుంచి రూ. 4999 చొప్పున టికెట్లు విక్రయించడం చట్ట విరుద్ధమని, దీంతో సన్‌బర్న్ ఈవెంట్ ఆర్గనైజర్ సుమన్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు అదనపు డీసీపీ వెల్లడించారు. అలాగే అనుమతి లేని ఈవెంట్‌కు సంబంధించిన టికెట్ల జారీకి సహకరించిన బుక్ మై షో నోడల్ ఆఫీసర్, ఎండీలకు సైతం నోటీసులు జారీ చేస్తామని తెలిపారు.

న్యూ ఇయర్ వేడుకలపై అవగాహన కల్పించాం

కొత్త సంవత్సర వేడుకలకు సంబంధించి ఇప్పటికే ఈవెంట్ నిర్వాహకులకు అవగాహన కల్పించామని, మాదాపూర్ అదనపు డీసీపీ నర్సింహారెడ్డి తెలిపారు. మాదాపూర్ జోన్ పరిధిలో ఇప్పటివరకు న్యూఇయర్ ఈవెంట్ల అనుమతికి సంబంధించి మొత్తం 22 దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిలో ఇప్పటి వరకు ఒక ఈవెంట్‌కు మాత్రమే అనుమతి ఇచ్చామని తెలిపారు. ఈ లోపు ఎవరైనా ఈవెంట్ నిర్వాహకులు టికెట్ల విక్రయానికి పాల్పడితే చట్టరీత్య చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా న్యూఇయర్ వేడుకల్లో ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. సీసీ కెమెరాల నిర్వహణకు ప్రత్యేకంగా ఒకరిని నియమించుకోవాలన్నారు. డిసెంబర్ 31 తేదీ రాత్రి 1గంటలోపు ఈవెంట్లు పూర్తిగా నిలిపివేసే చర్యలు తీసుకోవాలని చెప్పారు. గేటెడ్ కమ్యూనిటీస్, కాలనీల్లో పార్క్‌లు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో సౌండ్ సిస్టమ్ నిర్వహణకు స్థానిక ఏసీపీ నుంచి అనుమతి తప్పనిసరన్నారు. ఈ సమావేశంలో మాదాపూర్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ తిరుపతి, గచ్చిబౌలి డీఐ రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

జీఆర్‌టీ జ్యువెలర్స్‌లో షాప్ అండ్ విన్ ఫెస్టివల్

సిటీబ్యూరో, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ): జీఆర్‌టీ జ్యువెలర్స్‌లో షాప్ అండ్ విన్ ఫెస్టివల్ ఆఫర్‌ను నిర్వహిస్తున్నామని మేనేజింగ్ డైరెక్టర్ జి.ఆర్.రాధాకృష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. పండుగల సీజన్‌లో జీఆర్‌టీ జ్యువెలర్స్‌లో వినియోగదారుల కోసం అన్ని కేటగిరిల్లోనూ ప్రత్యేకమైన కొత్త ఆభరణాల డిజైన్లను అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా షాప్ అండ్ విన్ ఫెస్టివల్ పథకం ఈనెల 31 వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని షాపింగ్ చేసి, బహుమతులను గెలుచుకోవాలన్నారు. ఈ ఆఫర్‌ను తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలోని షోరూమ్‌లలో ప్రారంభించామని తెలిపారు.

తొమ్మిది పాజిటివ్ కేసులు

సిటీబ్యూరో, మేడ్చల్: కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. కరోనా లక్షణాలు ఉన్నవారు సమాచారం ఇచ్చేలా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. కాల్ సెంటర్ నంబర్లు 94924 09781, 040-29700820కు ఫోన్ చేస్తే లక్షణాలు తెలుసుకుని అవసరమైతే వైద్య సేవలు అందించేందుకు సమీపంలో ఉన్న ప్రభుత్వ దవాఖానల్లో పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తారు. అలాగే ప్రస్తుతానికి 407 వెంటిలేటర్లు, నెబ్యులైజర్లు 1134, ఆక్సీమీటర్లు 3400, ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు 1129, ఆక్సిజన్ సిలిండర్లు 4967, పీపీఈ కిట్లు 33,988, ఎన్ 95 మాస్కులు 55,681,అవసరమైన మందులను అందుబాటులో ఉంచారు. అలాగే 37 అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు. కొవిడ్ సోకిన గర్భిణులకు కాన్పు చేయడానికి ప్రతి ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక ఆపరేషన్ థియేటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి టీ.రఘునాథ స్వామి జూమ్ మీటింగ్‌లో అధికారులను ఆదేశించారు. కాగా, నగరంలో సోమవారం తొమ్మిది కరోనా కేసులు నమోదైనట్లు వైద్య శాఖ బులెటిన్‌ను విడుదల చేసింది.

తల్లిని వేధిస్తున్నాడని.. తండ్రిని హతమార్చాడు

మియాపూర్, డిసెంబర్ 25 : ఏ పని చేయకుండా ఖాళీగా ఉంటూ మద్యానికి బానిసై తల్లిని వేధిస్తున్నాడన్న కోపంతో తండ్రిని కుమారుడు హతమార్చిన ఘటన మియాపూర్ ఠాణా పరిధిలో చోటు చేసుకున్నది. మియాపూర్ పోలీసుల కథనం ప్రకారం... సుభాష్ చంద్రబోస్ నగర్‌లో వంగలి డానియల్ తన భార్య దస్తమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తెలతో నివాసం ఉంటున్నాడు. లేబర్ పని చేసుకునే డానియల్ వారంలో ఒక రోజు పనికి వెళుతూ మిగిలిన నాలుగు రోజులు పని చేయకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. భార్య దస్తమ్మను సైతం పనికి వెళ్లనివ్వకుండా అడ్డుకుంటున్నాడు. దీనికి తోడు మద్యానికి బానిసై భార్యను తీవ్ర వేధింపులకు గురి చేస్తున్నాడు. అమ్మను ఎందుకు వేధిస్తున్నావని అడిగిన కుమారుడు ఖాసీంను సైతం తీవ్రంగా కొట్టాడు. ఈ క్రమంలో ఆగ్రహానికి గురైన కుమారుడు ఖాసీం తండ్రిని కట్టెతో తలపై బలంగా పలు మార్లు కొట్టాడు. దీంతో తీవ్ర రక్తస్రావమైన డానియల్‌ను కొండాపూర్ దవాఖానకు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేశారు. నిందితుడు ఖాసీంను అదుపులోకి తీసుకుని కోర్టులో ప్రవేశపెట్టినట్లు మియాపూర్ పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మైలార్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 25: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... డబీర్‌పురా ప్రాంతానికి చెందిన సయ్యద్ ఒమర్ నిహాల్ తన బంధువులు సయ్యద్ అబ్దుల్ రెహమాన్, సయ్యద్ ముజ్తాబా వాహేద్, మహ్మద్ రాహుద్దీన్, మహ్మద్ షోహెబ్‌లతో కలిసి కాటేదాన్‌లో ఓ ఫంక్షన్‌కు ఆదివారం రాత్రి వెళ్లారు. అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో ఫంక్షన్ ముగించుకొని ఐదుగురు కారులో ఇంటికి బయలుదేరారు. కాటేదాన్‌లోని శివసాయి కాంట వద్దకు రాగానే వాహనానికి కుక్క అడ్డు రావడంతో కారు నడుపుతున్న సయ్యద్ ముజ్తాబా అహ్మద్ ఒక్కసారిగా బ్రేక్ వేశారు. దీంతో కారు అదుపుతప్పి పక్కనే ఉన్న డివైడర్‌తో పాటు విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. కారు పల్టీ కొట్టడంతో నుజ్జునుజ్జు అయింది. కారు వెనక సీట్ మధ్యలో కూర్చున్న సయ్యద్ ఒమర్ నిహాల్ తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంలో గాయపడ్డ నలుగురిని ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పలు రైళ్లు రద్దు

సిటీబ్యూరో, డిసెంబర్ 25 (నమస్తే తెలంగాణ) : దక్షిణ మధ్య రైల్వే జోన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రైల్వే నిర్వహణ పనుల వల్ల పలు రైలు మార్గాల్లో ఆరు రైళ్లను రద్దు చేస్తున్నట్లు సోమవారం రైల్వే అధికారులు తెలిపారు. మిరాజ్-పార్లీ, కల్వాపూర్-నాగ్‌పూర్, కోల్వాపూర్-దనబాద్ వంటి రైల్వే స్టేషన్ల మధ్యలో ఆరు రైళ్లను రద్దు చేశామని పేర్కొన్నారు. ఈ నెల 26 నుంచి జనవరి 5 వరకు టైమ్‌టేబుల్ వారీగా రైళ్లను రద్దు చేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే మరో నాలుగు రైళ్లను పాక్షికంగా రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

బైక్ రేసింగ్‌లో.. హైదరాబాదీ ఉత్తమ ప్రదర్శన

తమిళనాడు రాజధాని చెన్నైలో జరిగిన ఇండియన్ జాతీయ మోటార్ సైకిల్ డ్రాగ్ రేసింగ్ చాంపియన్ షిప్‌లో జరిగిన పోటీల్లో నగరంలోని మెహిదీపట్నంకు చెందిన బైక్ రేసర్ మహ్మద్ రియాజ్ ఉత్తమ ప్రతిభ కనబర్చి విజేతగా నిలిచాడు. ఈ నెల 23,24న చెన్నైలో ఉన్న మద్రాస్ అంతర్జాతీయ సర్క్యూట్‌లో జరిగిన నాలుగు రౌండ్లలో అత్యుత్తమ టైమింగ్‌తో సూపర్ స్పోర్ట్స్ విభాగంలో క్లీన్ స్వీప్‌తో విజేతగా నిలిచాడు. ఈ సందర్భంగా మహ్మద్ రియాజ్ మాట్లాడుతూ తన తండ్రి మహ్మద్ యూసుఫ్, తనను ప్రోత్సహించిన అందరికీ రుణపడి ఉంటానని తెలిపారు.

- మెహిదీపట్నం, డిసెంబర్ 25